www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 12 ఆగస్టు 2023
5
అన్నమయ్య

మదనపల్లె మార్కెట్‌లో మరింత తగ్గిన టమోటా ధరలు

మదనపల్లె అర్బన్: మదనపల్లె మార్కెట్‌లో ఐదు రోజులగా టమోటా ధరలు తగ్గుముఖం పట్టాయి. గురువారం వరకు మార్కెట్‌కు 300 టన్నులు టమోటా రాగా శుక్రవారం 400 టన్నులకుపైగా సరుకును రైతులు తీసుకువచ్చారు. ఏ గ్రేడు టమోటాలు కిలో రూ.30 నుంచి రూ.40 వరకు, బి గ్రేడు రూ.21 నుంచి రూ.28 వరకు పలికింది. సగటున కిలో టమోటా రూ.26 నుంచి 37 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారని మార్కెట్ యార్డు కార్యదర్శి అభిలాష్ తెలిపారు. గురువారం మదనపల్లె మార్కెట్‌లో ఏ గ్రేడ్ కిలో టమోటా రూ.50 నుంచి రూ.64 వరకు, బి గ్రేడ్ రూ.36 నుంచి రూ.48 వరకు పలికింది. ప్రస్తుతం అనంతపురం జిల్లాలో కర్నాటకలోని కోలార్ పరిధిలో టమోటా దిగుబడులు పెరిగాయని, ఆ ప్రభావంతోనే తాజాగాధరలు మరింత తగ్గుముఖం పట్టినట్లు అధికారులు వెల్లడించారు.

మహిళల్లో ఆత్మస్థైర్యం పెంచడమే లక్ష్యం

- స్వయం సహాయక సంఘాలకు చెక్కుల పంపిణీలో కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే 'గడికోట'

స్వయం సహాయక సంఘాల సభ్యులకు మెగా చెక్‌ను అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రాయచోటి

స్వయం సహాయక సంఘాల మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని, వారికి ఆర్థిక భరోసాను నింపేందుకే 'వైఎస్ఆర్ సున్నా వడ్డీ' పథకాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ గిరీష, ప్రభుత్వ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని విసి హాల్లో జిల్లాలోని పట్టణ, గ్రామీణ పరిధిలో 28,545 సంఘాలకు మంజూరైన రూ.41.75 కోట్లను లబ్దిదారులకు మెగా చెక్కు రూపంలో అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీష మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక ప్రగతి కోసం సున్నా వడ్డీ లబ్ధి మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసి ప్రభుత్వం వారికి అండగా నిలవడం గర్వించదగ్గ విషయమన్నారు. ముఖ్యమంత్రి తన సుధీర్ఘ పాదయాత్రలో చేసిన హామీలన్నీ నెరవేరుతున్నాయన్నారు. మహిళ బాగుంటేనే ఇల్లు బాగుంటుందని తద్వారా గ్రామం, రాష్ట్రం, సమాజం బాగుంటుందని నమ్మి ముఖ్యమంత్రి ఆలోచన చేసి 90 శాతం పథకాలు మహిళల పేరిట అమలు చేస్తున్నారన్నారు. గ్రూపులో ఉన్న మహిళా సభ్యులు చిన్న చిన్న వ్యాపారం చేస్తూ పెద్ద, పెద్ద వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నారు. బ్యాంకుల నుండి రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన పొదుపు సంఘాల్లోని పేదింటి అక్కచెల్లెమ్మల మీద ఏ మాత్రం వడ్డీ భారం పడకుండా, ప్రభుత్వమే వారి తరఫున వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద ఆ భారాన్ని భరిస్తుందన్నారు. ఎంత వడ్డీ అవుతుందో అంత మొత్తాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. వివిధ పథకాల ద్వారా పొందిన లబ్ధితో మహిళలు చిన్న, చిన్న వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుందన్నారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం వైయస్ఆర్ సున్నా వడ్డీ పథకంను ప్రవేశపెట్టిందనన్నారు. మహిళల సంక్షేమ విషయంలో ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పొదుపు సంఘాల విషయంలో ముఖ్యమంత్రి ఎంతో మేలు చేయాలని సద్దుదేశంతో చెప్పిన మాట ప్రకారం ఇప్పటికీ మూడు విడతలు రుణమాఫీ చేశారన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఎప్పుడు కూడా సున్న వడ్డీ జమ కాలేదున్నారు. రాయచోటి నియోజకవర్గంలో రూ.ఏడు కోట్లు, రాయచోటి మున్సిపాలిటీలో రూ.1.20 కోట్లు, ఇప్పటి వరకు దాదాపు నాలుగు విడతలు రాయచోటి నియోజవర్గంలోనే రూ.30 కోట్ల పైగా అందజేసినట్లు తెలిపారు. దాదాపు 5 వేల గ్రూపులకు డబ్బులు జమైందన్నారు. మహిళలందరూ కూడా ఆర్థికంగా ఎదగాలన్నారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాష మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలు పడుతున్న కష్టాలను తన పాదయాత్రలో కళ్లారా చూసిన ముఖ్యమంత్రి సున్నావడ్డీకే రుణాలు ఇస్తానని హామీ ఇచ్చారని, ఆ హామీని తూచా తప్పక అమలు చేసి నాలుగోవ ఏడాది కూడా నిరంతరాయంగా లబ్ది మొత్తాన్ని అందించి మాట తప్పని నేతగా కీర్తిగడిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, ఎల్‌డిఎం వెంకటేశ్వరరెడ్డి, డిఆర్‌డిఎ, మెప్మా సిబ్బంది, గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘ మహిళలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సంక్షేమమే ధ్యేయం

- సఫాయి కర్మచారీ జాతీయ కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేషన్

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేషన్

ప్రజాశక్తి-కడప

పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం, కుటుంబ భద్రత, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం పాటుపడుతోందని సఫాయి కర్మచారీ కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేషన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ స్పందన హాలులో జిల్లాలోని సఫాయి కర్మచారీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో వెంకటేషన్ మాట్లాడుతూ ఈ రోజు సమాజం ఆరోగ్యకరంగా, ఆహ్లాదకరంగా ఉందంటే పారిశుధ్య కార్మికుల శ్రమ ఫలితమేనన్నారు. పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబాలు ఆరోగ్య వంతంగా ఉంటేనే నగరాలు, పట్టణాలు, గ్రామాలు ఆరోగ్యవంతంగా ఉంటా యన్నారు. ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసి కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోందన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా రూ.5 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ, ఆవాస్ యోజన ద్వారా హౌసింగ్ పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రతి నెలా రెండవ సోమవారం కార్మికుల సమస్యలను విన్నవించేందుకు ప్రత్యేక ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించేలా అన్ని మున్సిపాలిటీల కమిషనర్లను ఆదేశించారు. మహిళా కార్మికుల సమస్యలను గుర్తించి, పరిష్కార చర్య లను చేపట్టాలని ఆదేశించారు. కార్మికులందరికీ ఇఎస్ఐ, ఇపిఎఫ్ ఖాతాలు నమోదు చేయించాలని, కార్మికుల కుటుంబాలన్నింటికి హెల్త్ కార్డులను అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకుముందు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలకు చెందిన పారిశుధ్య కార్మికులు హాజరై వృత్తి పరంగా, ఆర్థికంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆ కమిషన్ చైర్మన్ వెంకటేషన్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జెసి గణేష్ కుమార్, కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, ఎఎస్‌పి తుషార్ డూడీ, శిక్షణ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్‌డిఒ ధర్మ చంద్రారెడ్డి, జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి, డిపిఒ ప్రభాకర్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి, ఎస్‌సి, బిసి, మైనారిటీ కార్పొరేషన్ల ఇడిలు డాక్టర్ హెచ్.వెంకట సుబ్బయ్య, డాక్టర్ వి.బ్రహ్మయ్య, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డిసిహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్

పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా ప్రజలందరిలో దేశభక్తి భావాలు రేకెత్తించేలా పంద్రాగస్టు వేడుకలను పెద్దఎత్తున చేపట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వివిధ శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ గిరీష ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలపై సంబందిత జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఏర్పాటైన తర్వాత రెండవసారి జిల్లా కేంద్రంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోబోతున్నామన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కనువిందు చేసే రీతిలో నిర్వహించాలని ఆయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. దేశభక్తి ఉట్టిపడేలా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. శకటాలను ఓవరాల్ గా కోపరేటివ్, పరిశ్రమల శాఖ జిల్లా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. నవరత్నాల అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా వ్యవసాయం, డీఆర్‌డీఏ, హౌసింగ్, వైద్యం, డ్వామా, ఐసిడిఎస్, సివిల్ సప్లై, పశు సంవర్ధక, హార్టికల్చర్, పంచాయతీ రాజ్, రీ సర్వే, మున్సిపల్ తదితర అన్ని సంక్షేమ శాఖల అభివృద్ధి కార్యక్రమాలపై ఏర్పాట్లు చేసే శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా, అందరిని ఆకట్టుకునేలా ఉండాలని సూచించారు. ప్రభుత్వ శాఖలు ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా అభివృద్ధిపై సందేశ బుక్‌లెట్‌ను సిద్ధం చేయాలని డీఐపీఆర్‌ఓను ఆదేశించారు. స్వాతంత్ర్య సమరయోధులకు, జిల్లా ప్రజాప్రతినిధులకు, అధికారులకు వేర్వేరుగా ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓకు సూచించారు. అత్యంత ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాల జారీకి జాబితాను సిద్ధం చేయాలని డిఆర్ఓ ను ఆదేశించారు. అనంతరం ఎస్పీ గంగాధర్ రావుతో కలిసి పరేడ్ గ్రౌండ్‌ను సందర్శించి వివిధ శాఖల అధికారులకు తగు సూచనలు చేశారు సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, ఎస్పీ గంగాధర్ రావు, డిఆర్ఓ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగుల సంక్షేమానికి కృషి : ఇయు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం కోసం అలుపెరుగని కృషి చేస్తామని ఆర్‌టిసి ఇయు రాష్ట్ర నాయకులు పలిశెట్టి దామోదరరావు, జి.వి.నరసయ్యలు అన్నారు. శుక్రవారం ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం స్థానిక మునిసిపల్ టౌన్ హాల్‌లో జిల్లా యూనియన్ అధ్యక్షులు ఎస్.ఎం.వల్లి అధ్యక్షతన,జిల్లా కార్యదర్శి పి.నాగభూషణంరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా ఆర్‌టిసి ఇయు రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆవుల ప్రభాకర్ జోనల్ కార్యదర్శి ఎన్.రాజశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఆర్టీసి ఉద్యోగుల భద్రత కోసం ఉద్యోగ సంఘాలు,మేనేజ్ మెంటు కలసి చర్చించుకొని ఇచ్చిన 01/2019 సర్కులరును ఆర్టీసి అధికారులు అన్నిచోట్ల యధావిధిగా అమలు జరిగేలా చర్యలు తీసుకొని ఉద్యోగులు ఆత్మస్థైర్యం దెబ్బతినకుండా చూడాలని ఆర్‌టిసి మేనేజింగు డైరెక్టరుకు లేఖ ఇచ్చామని, ఆర్‌టిసి ఉద్యోగులకు మినహాయింపునిచ్చి పాతపద్ధతులలో మెరుగైన ట్రీట్మెంట్ కొరకు రెఫరల్ హాస్పిటల్స్ ద్వారా కార్పొరేట్ వైద్యం చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వ ఉన్నతాధికార్ల దృష్టికి, ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుతో జరిగిన చర్చలలో వారి దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందని వారు కూడా సానుకులంగా స్పందించారని వీటిని సాదించుకొనేందుకు ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటిగా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో జోనల్ నాయకులు సుబ్రహ్మణ్యం, సి.మధు, జిల్లా నాయకులు జిల్లాలోని 5 డిపోల నుండి అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజ్ నాయకులు, మదనపల్లి డిపో-1, డిపో-2 మధు, ఆనందబాబులతోపాటు కార్యదర్శులు మాట్లాడారు. అధిక సంఖ్యలో ముఖ్య కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇయు నాయకులు

అర్జీలకు మెరుగైన పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి-రాయచోటి

'జగనన్నకు చెబుదాం' యొక్క గ్రీవెన్స్‌లో ఖచ్చితంగా పరిష్కారం ఉండాలని అధికారులను కలెక్టర్ గిరీష ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ విసిలో 'జగనన్నకు చెబుదాం' అర్జీల పరిష్కరంపై జిల్లా, డివిజనల్, మండల స్థాయి కోఆర్డినేషన్ మిటింగ్ ను కలెక్టర్, జిల్లా ఎస్పీ గంగాధర్‌రావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలకు సంబంధించి అర్జీదారుల సమస్యలకు మరింత మెరుగైన పరిష్కారం చూపేలా తపన, తాపత్రయంతో అధికారులు పని చేయాల న్నారు. అధికారులు పలకాల్సిన పరిస్థితుల్లో పలికితే, న్యాయంగా, ధర్మంగా ఉంటె ఎలాంటి సమస్యలకైనా పరిష్కారం అవుతాయని ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ కార్యక్రమం తీసుకువచ్చారన్నారు. బాధ్యతతో అధికారులు పని చేయాలన్నారు. మారుమూల గ్రామాల నుంచి జిల్లా స్థాయి వరకూ అన్ని స్థాయిల్లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. సమస్యకు పరిష్కారం చూపించేటప్పుడు అర్జీదారుకి సంతోషాన్ని కలిగించేలా, ఆ మనిషి ముఖంలో చిరునవ్వులు చిందించాలన్న పరిష్కరం చూపాలన్నారు. నాణ్యతతో సమస్యల పరిష్కరించాలన్నారు. ప్రతి బుధవారం మండల స్థాయి కమిటీ మీటింగ్ పెట్టుకోవాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను చాలా ఓపిగ్గా విని ఫిర్యాదారులతో నవ్వుతూ ఆప్యాయంగా పలకరిస్తే సగానికి సగం సమస్యలు పరిష్కారం అవుతాయి అన్నారు. పరిష్కారం నాణ్యవంతంగా ఫిర్యాదుదారుడు సంతృప్తికరంగా ఉండేలా పరిష్కరించాలన్నారు. ఎస్పీ గంగాధర్‌రావు మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సంతృప్తి స్థాయి పెంచేలా క్షేత్రస్థాయిలో అధికారులు పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తే ఎలాంటి సమస్య అయినా పరిష్కరించవచ్చున్నారు. ప్రజలు వ్యయ ప్రయాస కోర్చి మారుమూల ప్రాంతం నుంచి సోమవారం జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు తమ సమస్యలను చెప్పుకోవడానికి వస్తున్నారని అలాంటి వారి పట్ల మండల స్థాయిలోనే ఓపిగ్గా విని వారికి అర్థమయ్యేలా చెప్పి అక్కడికక్కడే సమస్యను పరిష్కారం చేస్తే ఇంత దూరం రారన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ఎస్‌డబ్ల్యుఎఫ్ గౌరవాధ్యక్షులు మాదినేని శంకర్ నాయుడు

ప్రజాశక్తి-పీలేరు

ఎపిపిటిడి ఉద్యోగులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీలేరు డిపో ఎస్‌డబ్ల్యుఎఫ్ గౌరవాధ్యక్షులు మాదినేని శంకర్ నాయుడు తెలిపారు. శుక్రవారం ఏపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సర్వసభ్య సమావేశం అధ్యక్షులు కెసిఎస్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షులుగా శంకర్ నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల కండిషన్, ఆర్టీసీ స్థలం ఆక్రమణల గురించి, ఉద్యోగులు సిబ్బంది సమస్యల పరిష్కారం కోరుతూ డిపో మేనేజరుకు వినతి పత్రాన్ని సమర్పించి, వాటి పరిష్కారాన్ని కోరాలని తీర్మానించామన్నారు. ఒప్పంద కార్మికులు, ఒప్పంద డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కూడా తీర్మానించామని చెప్పారు. సమావేశానికి ఎపిపిటిడి ఎస్‌డబ్ల్యుఎఫ్ జోనల్ కార్యదర్శి సి.భాస్కర్, పీలేరు డిపో కార్యదర్శి హెచ్‌ఎం.బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసుస్టేషన్ ఎదుట నిరసన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కౌన్సెలింగ్ పేరుతో మహిళలను తీసుకొచ్చి కేసులు నమోదు చేస్తున్నారంటూ నక్కలదిన్నె తాండాకు చెందిన మహిళలు స్థానిక ఎక్సైజ్ పోలీస్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ కేసులతో ఎక్సైజ్ పోలీసులు అమాయకులను, గతంలో సారా అమ్మి కూలీపనులు చేసుకునే వారిపై కేసులు నమోదు చేస్తున్నారని, సిఐ శ్రీహరి రెడ్డి మహిళలతో అసభ్యంగా మాట్లాడుతున్నారని, మీరు ప్రతివ్రతల అని సంబోధించారని ఆవేదన వ్యక్తం చేశారు. మీ అందరిపైన కేసులు నమోదు చేస్తాం ఏమి చేస్తారంటూ బెదిరిస్తున్నారని, కొందరి దగ్గర డబ్బు తీసుకుని వదిలేస్తున్నారని ఆరోపించారు. సిఐ శ్రీహరి రెడ్డి ఆగడాలు ఎక్కువ అయ్యాయని పలువురు వాపోతున్నారు. ఎక్సైజ్ పోలీసుల పిర్యాదుతో రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని బాధితులకు నచ్చచెప్పి పంపించేశారు.

జాతీయ జెండాలు పంపిణీ

పీలేరు: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దృష్టిలో ఉంచుకుని తపాలా ఉద్యోగులు కెవి.పల్లె మండలంలోని సొరకాయలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఉచితంగా జాతీయ జెండాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిపిఎం సోమశేఖర్‌రెడ్డి, కెవి.పల్లి సచివాలయాల కన్వీనర్ పోత్తపు సతీష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు అయ్యప్పరెడ్డి, కృష్ణ, చరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

వరిలో సస్య రక్షణపై శిక్షణ ఇస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

వరిలో సమగ్ర సస్యరక్షణపై శిక్షణ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వరి పంటను ఆశించిన చీడ పీడల నివారణ, సమగ్ర సస్యరక్షణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం మండలంలోని ఓబులంపల్లి రైతు భరోసా కేంద్రంలో కెవికె కలికిరి, జిల్లా వనరుల కేంద్రం రాయచోటి ఆధ్వర్యంలో చీడ పీడల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఆర్‌సి ఎడిఎ శ్రీకాంత్ మాట్లాడుతూ సిఫారసు మేరకు నత్రజని ఎరువును వాడాలని సూచించారు. వరికి రైతులు పొటాష్ వాడడం లేదని గుర్తించారు. చిరు పొట్టదశ తర్వాత కూడా అనవసరంగా అధికంగా యూరియ వాడడం వలన పంటకాలం పెరగడమే కాకుండా తెగుళ్ల సమస్య కూడా అధిక మౌతుందన్నారు. అంకుర దశలో 25కిలోల యూరియతో పాటు 15కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువును విరిగా వాడాలని సూచించారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు లభించిన తేమ జిప్సం ఎరువు వినియోగానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త పీరుసాహెబ్, ఎడిఎ వాణిశ్రీ, ఎఒ హేమలత, ఆర్‌బికే సిబ్బంది రేణుక పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో విజయభారతి విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో అన్నమయ్య జిల్లా,మదనపల్లె పట్టణంలోని విజయభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని జన్నీ సాహితీ సత్తా చాటింది. జార్ఖండ్ రాష్ట్రంలో జరిగిన ఈ పోటీల్లో ఏపీ నుండి 12 మంది క్రీడాకారిణులు హాజరు కాగా,అందులో సాహితీ ఒకరు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు మాట్లాడుతూ 12 మంది సభ్యులతో కూడిన ఏపీ బాస్కెట్ బాల్ జట్టు జాతీయ స్థాయిలో ఏడో స్థానంలో నిలవడం,అందులో తమ పాఠశాల విద్యార్థిని సాహితీ ఉండడం గర్వకారణమన్నారు. తమ పాఠశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించడం ఆనందంగా ఉందన్నారు. మా పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడం తోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహిస్తున్నాము అన్నారు. అనంతరం జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన సాహితీని ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో క్రీడల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్ సేతు

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నిబంధనలకు వ్యతిరేకంగా ప్రభుత్వ సెలవు దినాలలో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంఇఒలు రఘునాథరాజు, సుబ్బరాయుడులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ పట్టణంలో కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలు ప్రభుత్వం నిబంధన అతిక్రమిస్తూ ఇష్టానుసారంగా ప్రభుత్వ సెలవు దినాలల్లో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులకు ఆటవిడుపు లేకుండా మానసికంగా ఒత్తిడికి గురి చేస్తూ విద్యార్థులను వేదనకు గురి చేస్తున్నారన్నారు. నిబంధనల ప్రకారం తరగతులు నిర్వహించని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఎస్ఎఫ్ఐగా అడ్డుకుంటామన్నారు. జూన్‌లో ప్రారంభమైన విద్యాసంస్థలు నేటికీ ఒక్క విద్యా సంస్థ కూడా ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం పాఠశాలలు నిర్వహించడం లేదన్నారు. విద్యాశాఖ అధికారులుగా ఇద్దరిని నియమించినప్పటికీ పర్యవేక్షణ మాత్రం శూన్యమన్నారు. ఎంఇఒలు కూడా ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలక్షేపం చేయడం తప్ప చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఉదయం 6 నుండి రాత్రి 8 గంటల వరకు విద్యార్థులకు చదువు తప్ప మరొకటి లేదన్నారు. కనీసం విద్యార్థులు ఆడుకోవడానికి ఆట స్థలాలు లేవని, సెలవు దినాలలో ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండాల్సిన విద్యార్థులను పాఠశాల నాలుగు గదుల మధ్యలో కూర్చోబెట్టి ఒత్తిడి చేయడం దారుణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు గౌరీ శంకర్, కార్యదర్శి ఉపేంద్ర, కమిటీ సభ్యులు గోవర్ధన్, మురళి, చెంగయ్య, నవీన్, కార్తీక్, పవన్ పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ : సెలవు రోజులలో నవోదయ సైనిక్ కోచింగ్ సెంటర్లు, స్కూల్ లు నిర్వహిస్తే అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, ఐఎఫ్ఎస్ జిల్లా సహాయక కార్యదర్శి సాయికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు, సైనిక్ నవోదయ కోచింగ్ సెంటర్లు ప్రభుత్వ నిబంధన అతిక్రమిస్తూ ఇష్టానుసారంగా ప్రభుత్వ సెలవు రోజులలో నిర్వహిస్తూ విద్యార్థులకు ఆటపాటలు లేకుండా చదువు పై ఒత్తిడి చేస్తూ మానసికంగా విద్యార్థులను వేదనకు గురి చేస్తున్నారన్నారు. ఉదయం 6 నుండి రాత్రి 8 గంటల వరకు విద్యార్థులకు చదువు తప్ప మరొకటి లేదన్నారు. కనీసం విద్యార్థుల ఆడుకోవడానికి ఆట స్థలాలు లేవని పేర్కొన్నారు. సెలవు రోజుల్లో ఉత్సాహంగా ఉల్లాసంగా ఉండాల్సిన విద్యార్థులను పాఠశాల నాలుగు గదుల మధ్యలో కూర్చోబెట్టి ఒత్తిడి చేయడం జరుగుతోందని చెప్పారు. సెలవులు ప్రకటించకపోతే ఎస్ఎఫ్ఐగా అడ్డుకొని తీరుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చందు, నాగార్జున, విష్ణు పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి-రాయచోటి

తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధిని సాధిస్తోందని వైసిపి పాలనతో రాష్ట్రం అన్నివిధాలా నష్టపోయిందని టిడిపి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి వతన్ నిసార్ పేర్కొన్నారు. శుక్రవారం సుండుపల్లె రోడ్డులోని తమ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టిన తరువాత అందించే సంక్షేమ పథకాలను వివరించారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని, గ్రామపంచాయతీలకు విడుదలైన నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇతర పథకాలు పేరిట మళ్లించి గ్రామల అభివృద్ధికి తోక్కేసిందన్నారు. టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుగత పాలనలో ప్రతి గ్రామంలో సిసి రోడ్లు, విద్యుత లైట్లు, రైతులకు నాణ్యమైన విద్యుత, చంద్రన్న బీమా, విద్యార్థులకు విదేశీ విద్య డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఆడపడుచులకు పసుపు కుంకుమ, పేదల ఆకలి తీర్చడానికి అన్న క్యాంటీన్లు, మైనార్టీలకు హజ్ హౌస్, దులహన్పథకంఅందాయని పేర్కొన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో మహాశక్తినే చంద్రబాబుకు ముఖ్యమంత్రి ని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

నేడు కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ల సమావేశం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నేడు శనివారం ఉదయం 10 ు 11 గంటల మధ్య మదనపల్లె నియోజకవర్గ కో-ఆర్డినేషన్ సభ్యుల సమావేశం నిర్వహించబడునని కాంగ్రెస్ పార్టీ మదనపల్లె పట్టణ అధ్యక్షులు, పీలేరు నియోజకవర్గ కన్వీనర్ ఎస్.రెడ్డీ సాహెబ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ రాజ్యసభ సభ్యులు, ఎపిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి, ఎపి కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, రాయలసీమ జిల్లాల ఇన్ చార్జ్ జంగ గౌతమ్ హాజరౌవుతున్నారన్నారు. ఈ సమావేశం కన్వీనర్ లీలా శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించబడునని తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గ కో-ఆర్డినేషన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు ప్రతి ఒక్కరూ తప్పక హాజరై సమావేశాన్ని దిగ్విజయం చేయాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మేడాబాబు

పునరావాస కల్పనలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జవాద్ తుఫాను సమయంలో ముంపుకు గురైన వరద బాధిత ప్రాంతాలలో ప్రజలకు పునరావాసం కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మేడా విజయశేఖర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం వరద బాధిత ప్రాంతాలైన పులపుత్తూరు, తొగురుపేట గ్రామాలను ఆయన సందర్శించారు. వరద బాధితులకు పునరావాసం కింద రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న గృహాలను ఆయన పరిశీలించారు. ప్రజల చెంతకు వెళ్లి గృహ నిర్మాణాల పట్ల అభిప్రాయాలను సేకరించారు. నిర్మాణాల గురించి కాంట్రాక్టర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా మేడాబాబు మాట్లాడుతూ వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం నాణ్యతలేని ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారని తెలిపారు. నాణ్యతలేని ఇళ్ల నిర్మాణం వలన అవి త్వరలోనే శిథిలావస్థకు చేరుతాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారని అన్నారు. ప్రజల పక్షాన నిలబడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో మేడా బాబు అనుచరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు ద్విచక్ర వాహనాల వేలం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి రికార్డులు, సమాచారం లేని సీజ్ చేసిన 38 ద్విచక్ర వాహనాలను కోర్టు అనుమతి ద్వారా బహిరంగ వేలంపాటను నిర్వహిస్తున్నట్లు టూటౌన్ సిఐ ఎస్.మురళీకృష్ణ తెలిపారు. 34 ద్విచక్ర వాహనాలు స్క్రాప్, నాలుగుద్విచక్ర వాహనాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించుకొని నడుపుకొనుటకు అవకాశం ఉందన్నారు. బహిరంగ వేలంపాటను ఈ నెల 13వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలకు పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి కలవారు బహిరంగ వేలంపాటలో పాల్గొనుటకు డిపాజిట్ నగదు చెల్లించి పాల్గొనవచ్చని తెలిపారు.

నేడు బి.కొత్తకోట మండల సమావేశం

ప్రజాశక్తి- బి.కొత్తకోట

మండల అభివృద్ధిపై శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శంకరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని తహశీల్దార్, పంచాయతీరాజ్ ఎఇ, డిఇఇ, ఆర్ డబ్ల్యుఎస్, ఎఇ, డిఇఇ, గృహనిర్మాణశాఖ ఎఇ, డిఇఇ, ఉపాధి హామీ ఎపిఒ, వెలుగు ఏపీఎం,పంచాయతీ కార్యదర్శులు,వీఆర్వోలు,సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అధికారులు తమ ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ముఖ్యంగా ఈ సమావేశంలో వివిధ శాఖల పనితీరు,అభివృద్ధిపై చర్చించడం జరుగుతుందన్నారు.

వార్డు మెంబర్లు ఏకగ్రీవం

ప్రజాశక్తి-కలికిరి

మండలంలో ఇద్దరు వార్డు మెంబర్లు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి నాగార్జున తెలిపారు. మండలం లోని గుట్టపాలెం పంచాయతీ లో 5వ వార్డ్, పల్లవోలు పంచాయతీలోని 2వ వార్డు సభ్యులు అనారోగ్యంతో మృతి చెందడంతో ఉప ఎన్నికలకు గాను రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూలు విడుదల చేసింది. మూడు రోజులపాటు నిర్వహించిన నామినేషన్ కార్యక్రమంలో రెండు వార్డులలోనూ ఒక్కొక్కరు మాత్రమే గుట్టపాలెం పంచాయతీ సుధా రామ చంద్రయ్య, పల్లవోలు పంచాయతీ రెండవ వార్డుకు మాత్రమే నామినేషన్ వేశారు. ఎన్నికల అధికారి నాగార్జున వీరిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారికి పత్రాలు అందజేశారు. **గాలివీడు :** గాలివీడు పంచాయతీలో5వ వార్డుకు పోలిమేని మాతమ్మ వార్డు సభ్యురాలుగా నామినేషన్ దాఖలు చేశారు, 10వ వార్డుకు తంగాల వెంకటరత్నం నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం స్కూటీలో వార్డు ఒకరే ఉండడంతో ఏకగ్రీవానికి గ్రీన్ సిగ్నల్ పడింది. ఇద్దరు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని స్టేజ్ వన్ ఆఫీసర్ డి.శ్రీనివాసులు, ఎంపిడిఒ శేఖర్‌నాయక్ తెలిపారు.

పంట నమోదు, ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-పుల్లంపేట

రైతు భరోసా అధికారులు, ఉద్యాన సహాయకులు తమ పరిధిలోని పంటలకు, పంట నమోదుతో పాటు రైతులకు తప్పనిసరిగా ఇ-కెవైసి చేయించాలని మండల వ్యవసాయాధికారి కృష్ణ చైతన్య ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో వ్యవసాయ శాఖ, రైతు భరోసా అధికారులతో ఎఒ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పిఎం కిసాన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అందించే రూ.6.వేలు అందాలంటే పంట నమోదుతో పాటు రైతులకు ఇ-కెవైసి తప్పనిసరిగా చేయించాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ముందస్తు పరీక్షలు నిర్వహించి ఎంఆర్‌పి ధరలకే రైతులకు నాణ్యమైన ఎరువులను అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుదర్శన్ రెడ్డి, వెటర్నరీ డాక్టర్ సుదీష్, మండలి సభ్యులు లక్ష్మీకాంత్ రెడ్డి, రైతులు, రైతుభరోసా సిబ్బంది పాల్గొన్నారు.

రెండు రైళ్లు రద్దు

ప్రజాశక్తి-ములకలచెరువు

ధర్మవరం నుంచి కదిరి, ములకలచెరువు, మదనపల్లె మీదుగా వెళ్లే రెండు రైళ్లు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ధర్మరం నుంచి నర్సపూర్, మచిలీపట్నం నుంచి ధర్మవరం, ధర్మవరం నుంచి మచిలీపట్నం, నర్సపూర్ నుంచి ధర్మవరం వెళ్లే రైళ్లు ఈ నెల 15 వరకు రద్దు చేసినట్లు తెలిపారు. తిరుపతిలో ప్లాట్‌ఫామ్ పనులు, విజయవాడ డివిజన్ పరిధిలోని మనుబోలు, గూడురు సెక్షన్‌లో మూడు లైన్ల పనులు జరుగుతుండడంతో ఈ మార్గంలో రద్దు చేసినట్లు తెలిపారు. 16వ తేది నుంచి యధావిధిగా నడవనున్నట్లు తెలిపారు.

రూ.2 కోట్లతో నగరవనం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఎస్ఆర్‌పాలెం రాజంపేట-రాయచోటి ప్రధాన రహదారిలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో అటవీ ప్రాంతంలో రూ.2కోట్లతో పజలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మిస్తున్న నగరవనంను ఘనంగా ప్రారభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఇలాంటి నగరవనాన్ని నిర్మిస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెపారు. కార్యక్రమంలో రాజంపేట మేడా మల్లికార్జునరెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, పిసిసిఎఫ్ మధుసూదన్‌రెడ్డి, తిరుపతి సిసిఎఫ్ నాగేశ్వరరావు, కర్నూలు సిసిఎఫ్ రామకృష్ణ, రాజంపేట డిఎఫ్ఒ వివేక్, రాజంపేట డిఎస్‌పి చైతన్య, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జనార్ధన్ రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

నగరవనం ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

టిడిపి జెండా ఎగురవేయడమే లక్ష్యం

- ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని బలోపేతం చేస్తా
- కార్యకర్తలకు అండగా ఉంటా
- చమర్తి జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగురవేయడమే తన లక్ష్యమని ఆ పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ విద్యావేత్త చమర్తి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ గతంలో టికెట్ ఆశించి దక్కకపోయినప్పటికీ పార్టీలోనే ఉంటూ ప్రజాసేవతో ప్రజలకు మరింత దగ్గరై పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నానని అన్నారు. తెలుగుదేశం పార్టీ అట్టడుగున ఉన్న ప్రజల సంక్షేమం కోసం నిర్మించబడిందని, ఆది నుంచి సేవా భావం కలిగి అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్న తాను ప్రజలకు మరింత సేవ చేసేందుకే తెలుగుదేశం పార్టీలో కొనసాగు తున్నట్లు తెలిపారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, అణగారిన ప్రజలకు ఆశాదీపం, వెన్ను-దన్ను టిడిపియే నని అన్నారు. ఒక్క అవకాశం ఇచ్చి చూడాలని వైసీపీ ను నమ్మి ప్రజలు నిలువునా మోసపోయారని, రాష్ట్ర ప్రజానీకమంతా తిరిగి చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని కోరుకుంటోందని తెలిపారు. 2024 లో టిడిపి ప్రభంజనాన్ని వైసిపి అడ్డుకోలేదని అన్నారు. అధిష్టానం ప్రకటించిన మినీ మ్యానిఫెస్టో ప్రజలకు చేరువయిందని, రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు పార్టీ భరోసా కల్పించిందని అన్నారు. లోకేష్‌బాబు చేపట్టిన యువగళం పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టడమే రాష్ట్రంలో నాయకత్వ మార్పును ప్రజలు కోరుకుంటున్నాట్లు స్పష్టమవుతోందని తెలిపారు.

ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని బలోపేతం చేస్తా

నియోజకవర్గంలో టీడీపీలోని అనేకమంది నేతల నాయకత్వంలో ద్వితీయ శ్రేణి నాయకులకు తగిన గుర్తింపు రాలేదని.. అసంతృప్తులను, ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని బలపరిచి వారికి అన్ని విధాలుగా అండగా ఉంటూ నియోజకవర్గంలో పార్టీని ముందుకు తీసుకెళ్లడంలో విజయవంతమయ్యానని చెప్పడంలో సందేహం లేదని తెలిపారు. టిడిపికి క్యాడరే బలమని, క్యాడర్ ను నడిపించే కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించడం జరుగుతోందని తెలిపారు. వారిలో ఒకరిగా ఉంటూ క్లిష్ట సమయాలలో చేయూతనిచ్చి ధైర్యాన్ని నింపుతూ ముందుకు తీసుకెళ్లడం జరుగుతోందని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలను కలియ తిరుగుతూ ప్రతి గ్రామానికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారం దిశగా కృషి చేయడం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలకు ఓదార్పునిస్తూ అవసరమైన చోట స్వచ్ఛందంగా సహాయ సహకారాలు అందిస్తూ కుటుంబంలో ఓ వ్యక్తిలా ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకోవడం జరిగిందని అన్నారు. నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ తన వెన్నంటే ఉంటారని తెలిపారు. ప్రజలలో ఆదరణ, కార్యకర్తల నిండైన అభిమానం, అధినేత చంద్రబాబు ఆశీస్సులు తమకు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. అవకాశం ఇస్తే అత్యంత మెజారిటీతో నియోజకవర్గంలో తెలుగుదేశం జెండా ఎగురవేసి సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : 'కొరముట్ల'

ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల

ప్రజాశక్తి-పెనగలూరు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిచడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివా సులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సింగారెడ్డిపల్లి గ్రామపంచాయతీలోని కంబల కుంటలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందకుంటే స్థానిక గ్రామ సచివాలయాన్ని సంప్రదిం చాలని సూచించారు. ప్రజల నుంచి వినతులను, సమస్యలను అధికారుల సమక్షంలో అక్కడికక్కడే పరిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారని అన్నారు. వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు ఆనందంతో ఉన్నారని అన్నారు. విద్యార్థులు, మహిళలు, రైతులు అన్ని వర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు. వైసిపికి వస్తున్న ప్రజాధరణ చూసి ఒర్వలేక ప్రతిపక్ష నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ పాలన కోసం మరోమారు వై.ఎస్.జగన్‌ను మరల ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కొండూరు విజయ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్, తహశీల్దార్ శ్రీధర్‌రావు, ఎంపిడిఒ వరప్రసాద్, ఎస్ఐ హేమాద్రి, సచివాలయ అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు. **కలకడ :** ప్రజా సంక్షేమం కోసమే గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఏనుగొండపాలెం పంచాయతీ దిగువ పాలెం సచివాలయంలో ఎగువకురవపల్లి, దిగివ పాలెం గుండావాండ్లపల్లి, అవులప్పగారిపల్లి, గుండావాండ్లపల్లి, హరిజనవాడ, మొరంమీదపల్లి గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి గన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రజాసంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజా సంక్షేమాన్ని కోరుతున్న ఏకైక ముఖ్యమంత్రిగా దేశంలో నిలిచారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్ మండల సచివాలయం కార్యదర్శి మోహన్‌రాజానాయుడు, ఎంపిటిసి ఈశ్వరయ్యానాయుడు, ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, తహశీల్దార్ ప్రదీప్ సచివాలయ, పంచాయతీ, వైసిపి నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగం మరువలేనిది

ప్రజాశక్తి-నందలూరు

దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగం మరు వలేనిదని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ సూర్యనారాయణ అన్నారు. గురువారం అరవ పల్లి జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో నాభూమి నాదేశం శిలాఫలకాన్ని ఆవిష్క రించారు. దేశం కోసం పాటుపడుతున్న అమరవీరులకు గౌరవ వందనం చేయడంతో పాటు వారిని ప్రత్యేకంగా అభినందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గుణ యాదవ్, నాగిరెడ్డిపల్లి కార్యదర్శి రాజేంద్రరెడ్డి, ఉపాధి హామీ అధికారులు, సచివా లయ సిబ్బంది, వాలంటీర్లు, పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** ఆజాది కా అమృత మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని వేమలేటికోట, పులుసు మనిపెంట, కోటూరు గ్రామ పంచాయతీలలో మన మట్టి-మనదేశం కార్యక్రమం నిర్వహించారు. మండలంలో చేసిన అభివృద్ధి పనులు గురించి గ్రామ సభల్లో వీరులకు వందనాలు చేసినట్లు ఎంపిడిఒ శంకరయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మీనరసమ్మ జడ్‌పిటిసి, రామచంద్ర యాదవ్, ఉపాధిహామీ ఎపిఒ మంజుల, వేములేటి కోట సర్పంచ్ రవికుమార్‌రెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారిరెడ్డి, వైసిపి జిల్లా ప్రచారి కార్యదర్శి అయూబ్‌బాషా, ఎంపిటిసిలు గౌతమీ, శివారెడ్డి, సచివాలయ కన్వీనర్ పీట్ల.రవీంద్ర, వార్డు మెంబర్లు మల్లికార్జున రెడ్డి, వెంకటేష్, కృష్ణప్ప,వైసిపి నాయకులు వెంకట్రమణా రెడ్డి, శంకరమ్మ, బద్దిపల్లి కృష్ణప్ప, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, .**కలికిరి :** స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి కావస్తున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆజాదీ క అమృత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గుట్టపాలెంకస్పాలో నాభూమి నాదేశం, నేల తల్లికి వందనం వీరులకు నమస్కారం కార్యక్ర మాన్ని నిర్వహించారు. గ్రామంలో ఉన్న జవాన్లు, వారి కుటుంబ సభ్యులు ను సన్మానిం చారు. కార్యక్రమంలో ఐటిబిపి సిబ్బంది, సెక్రటరీ గోపి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** భారతదేశ సైనికుల సేవలు వెలకట్టలేని కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి పిలుపునిచ్చారు. ఆజాది కా అమృత్ మహోత్సవ వేడుకల్లో భాగంగా కురవంక గ్రామపంచాయతీలో నాభూమి-నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా నాభూ మి-నాదేశం శిలాఫలకం ఆవిష్కరించారు. వసుధకు వందనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి నీరుపోశారు. కార్యక్రమంలో గ్రామజ్యోతి సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షురాలు బండపల్లి సుభద్ర, పంచాయతీ కార్యదర్శి బాబా మస్తాన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అఖిల్,వార్డ్ మెంబర్ కృష్ణమూర్తి,మాజీ ఆర్మీ సైనికుడు శివారెడ్డి, కురవంక బాబు, బిల్ కలెక్టర్ ఆనంద్, మహిళా పోలీస్ తోపాటు వినయ్ పాల్గొన్నారు. **కురబలకోట :** మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మేరీ మట్టి..మేర దేశ్ కార్యక్రమాన్ని కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కురబలకోట మండలానికు చెందిన మన అమర వీరుడు సాయితేజను కళాశాలలో తలుచుకున్నారు. ప్రిన్సిపల్ యువరాజ్ ఆధ్వర్యంలో సాయితేజ కుటుంబ సభ్యులను దుశ్శాలువాతో ఘనంగా సత్కరిం చారు. **తంబళ్లపల్లి :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆజాదిక అమృత్ మహోత్సవ వేడుకలను మండలంలోని కన్యమడుగు ,ఎద్దులవారిపల్లె, కొట్టాల, ఆర్‌యన్ తాండ , జుంజర పెంట, బాల్‌రెడ్డి గారి పల్లె ,కోసువారిపల్లి పంచాయతీలలో ఘనంగా నిర్వహించారు. మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపిడిఒ సురేంద్రనాథ్ తెలిపారు. కార్యక్రమాలలో సర్పంచులు శ్యామలమ్మ, రెడ్డి నారాయణ, సహదేవరెడ్డి, చెన్నకే శవరెడ్డి , భూదేవి, వేణుగోపాల్‌రెడ్డి, విజయలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు అప్పిరెడ్డి, శ్యామలమ్మ ,రామకృష్ణ ఎపిఒ అంజనప్ప పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఓటర్ల జాబితా ప్రక్రియ పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పర్మాన్‌అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లిలోని సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎల్‌ఒలు ఓటర్ల జాబితాను ఆయన పరిశీలించారు. మృతి చెందిన వారిని తొలగించి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని బిఎల్‌ఒలకు సూచించారు. సచివాలయం సిబ్బంది కూడా సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. సచివాలయంలో సిబ్బంది ఎప్పటికప్పుడు సమస్యలపై దృష్టి పెట్టి క్యాస్ట్, ఇన్కమ్ ఇతర విషయాలు పరిష్కరించాలన్నారు. అనంతరం వైద్య, ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న మందులు , కిట్లను సక్రమంగా అందించాలన్నారు. కాన్పులు ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ ఉదయ శంకర్ రాజు, ఎంపిడిఒ వెంకటరామిరెడ్డి, పంచాయతీ సెక్రెటరీ సుదర్శన్ రెడ్డి, ఆర్ఐ సమ్మత్ ఖాన్, బిఎల్‌ఒలు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఎంఇఒకు సత్కారం

ప్రజాశక్తి - పుల్లంపేట

మాట్లాడుతున్న ఎంపిపి బాబుల్‌రెడ్డి

మండల విద్యాశాఖ అధికారిగా సుదీర్ఘకాలం పనిచేసిన రంగనాథయ్య బదిలీలలో భాగంగా తిరుపతి జిల్లా రేణిగుంట మండల విద్యాశాఖ అధికారిగా బదిలీపై వెళ్లారు. శుక్రవారం మండల ఉపాధ్యాయ బృందం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఎంపిపి ముద్దబాబురెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రంగనాథయ్య నిరంతరం మండల విద్యాభివృద్ధి కోసం కృషి చేశారని, ఇలాంటి విద్యావేత్తను మండలం కోల్పోవడం చాలా బాధాకరంగా ఉందని, కానీ ప్రతి ఉద్యోగికి బదిలీలు, విరమణ సర్వసాధారణమని తెలిపారు. మండలంలో విద్యాభివృద్ధి మెరుగుపడాలని, ఎంఇఒ నిరంతరం శ్రమించాలి నేటి బాలలే రేపటి పౌరులని విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. అనంతరం రంగనాథయ్యను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో తాసిల్దార్ నరసింహ కుమార్, ఎంపిడిఒ రఘురాం, ఎంఇఒలు చక్రధర్‌రావు, నాగ తిరుమల రావు, ఉపాధ్యాయులు నరేంద్ర, సిఆర్‌పి శివ, ఆనంద్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లయ్య కొండపై ప్రత్యేక పూజలు

తంబళ్లపల్లి : మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో హైదరాబాదులో స్థిరపడిన తంబళ్లపల్లె వాసులు గణముఖ సుబ్రహ్మణ్యం, శిరీష దంపతులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు ముసలికుంట పవన్‌కుమార్‌శర్మ, ఈశ్వరప్ప, మల్లికార్జునులు ఆలయం ముందు హోమం నిర్వహించారు. రుద్రాభిషేకం, మృత్యుంజయ అభిషేకం, నవగ్రహగణపతి, అష్టదిక్పాలక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చి మహిళా భక్తుల సౌకర్యార్థం రూ.40 వేల ఖర్చుతో రెడీమేడ్ టాయిలెట్ గదిని ఏర్పాటు చేశారు. వారి దాతృత్వాన్ని ఆలయ కమిటీ చైర్మన్ కె.ఆర్ మల్ రెడ్డి, కొండకిట్ట ,ఆలయధర్మకర్త ప్రభాకర్‌రెడ్డిలు అభినందించారు.

వెనుకబడిన కులాలకు భూ పంపిణీ చేయాలి

ములకలచెరువు : జిల్లాలో వెనుకబడిన కూటాలకు చెందిన దళితులు, గిరిజనులు అతరలకు భూ పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణప్ప పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ములకలచెరువులో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా మొదటి మహాసభలు ఈ నెల 29, 30వ రైల్వేకోడూరులో నిర్వహించడం జరుగుతున్నారు. వ్యవసాయ కార్మికులకు దళితులకు, గిరిజనులకు రాష్ట్రం ప్రభుత్వం 8వ విడత భూ పంపిణీలో ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూములు ప్రతి కుటుంబానికి మూడు ఎకరాల చొప్పున పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తంబయ్యశెట్టి, వేమనారాయణ, అంజయ్యప్ప, వెంకటస్వామి, బాస్కర్ శివమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తత చాలా అవసరం

పీలేరు : అంగన్వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహించే సహాయకులు అప్రమత్తంగా విధులను నిర్వర్తించాలని పీలేరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ సి.రాజమ్మ తెలిపారు. శుక్రవారం స్థానిక సిఎల్ఆర్‌సి భవనంలోని సిడిపిఒ కార్యాలయంలో అంగన్వాడీ సహాయకుల విధి, విధానాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలను సమయానికి తెరవాలని, కేంద్రం పరిసరాలను శుభ్రంగా ఉంచాలని అన్నారు. ఆహారం వండే సమయంలో పిల్లలను దగ్గరకు రానీయవద్దని, ముఖ్యంగా ఆహారం కలుషితం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రాజెక్ట్ పరిధిలోని పీలేరు, కె.వి పల్లి, కలకడ మండలాల అంగన్వాడీ సూపర్వైజర్లు స్వరూప, స్వర్ణ, ఉమ, అన్నపూర్ణ, భారతి, శంకరమ్మ, సంఘం రాష్ట్ర కన్వీనర్ చిన్నమ్మ పాల్గొన్నారు

శేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న యాజమాన్యం

షామియానా హౌస్ ప్రారంభం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలోని జనసేనపార్టీ కార్యాలయం ఎదురుగా నూతనంగా ప్రారంభించిన షామియానా, లైటింగ్స్ వ్యాపార సముదాయాన్ని ఊటుకూరు ఎంపిటిసి నాగ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభిచారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తన పంచాయితీ పరిధిలోని ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం అభినందనీయమని అన్నారు. పంచాయితీ పరిధిలోని ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా దినదినాభివృద్ధి చెంది కుల, మత, వర్గ భేదాలు లేకుండా కలిసి మెలసి ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా కల్పించారు. అనంతరం దుకాణం యాజమాన్యం శేఖర్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ సునీల్, పుల్లంపేట సీనియర్ షామియానా సప్లయర్ వెంకటేష్, నారాయణ, హరికృష్ణ, శంకరయ్య, బాల నరసయ్య, సుబ్బరాయుడు, నరసింహ, రాఘవ, రమేష్ పాల్గొన్నారు.

సబ్సిడీతో గడ్డి కత్తిరించే యంత్రాలు

ప్రజాశక్తి-కలికిరి

పాడి రైతులు గడ్డి కత్తిరించే యంత్రాలను సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు ఏరియా పశు వైద్యాధికారి వెంకట మునినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు గడ్డి కత్తిరించే యంత్రాలతో గడ్డి కత్తిరించి పశువులకు వాడినట్లయితే తద్వారా పాలు దిగబడి, వెన్న శాతం పెరుగుతుందని అన్నారు. వేసవికాలంలో అయినా వర్షాకాలంలో కానీ గడ్డి చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించడం వలన పచ్చి గడ్డి నష్టం వాటిల్లదని సూచించారు. గడ్డి కత్తిరించే యంత్రం ధర రూ.33,970లు ఉండగా, పాడి రైతులకు సబ్సిడీపై రూ.20,382లకే అందిస్తుందన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరమైన రైతులు మీ గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రాలు, పశువైద్యశాలలో సంప్రదించాలని కోరారు.

క్రీడల్లో సత్తాచాటిన 'భవిత' విద్యార్థులు

ప్రజాశక్తి-గాలివీడు

జిల్లా కేంద్రం రాయచోటిలోని జూనియర్ కళాశాల ప్రాంగణంలో విభిన్నప్రతిభావంత పిల్లలకు నిర్వహించిన క్రీడలలో గాలివీడు మండలం స్థానిక భవిత సెంటర్ విద్యార్థులు సత్తాచాటరని ఎంఇఒలు పిల్లి నాగరాజు, శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎస్.ఆంజనేయులు పరుగు పందెంలో, ఈ.ఆనంద్ సాఫ్ట్ బాల్‌లో పోటీలలో ద్వితీయ బహుమతి సాధించారని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బహుమతులు గెలుపొందడంలో సహాయ సహకారాలు అందించిన సమ్మిళిత విద్య ఉపాధ్యాయుడు ఖలందర్‌ను అభినందించారు.

విద్యాదీవెన పెండింగ్ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

జగనన్న విద్యాదీవెన పెండింగ్ పనులను పూర్తి చేయాలని సోషల్ వెల్ఫేర్ అధికారి డి.జాకీర్‌హుస్సేన్ పేర్కొన్నారు. రాజంపేట, రైల్వే కోడూర్ వసతి గృహ సంక్షేమ అధికారుల, సంక్షేమ, విద్య సహాయకుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ జగనన్న విద్యాదీవెనకు సంబంధించిన అన్ని రకాల పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని విద్యా సహాయకులను ఆదేశించారు. అంతేకాకుండా రైల్వే కోడూరు రాజంపేట పరిధిలోని బాలుర మరియు బాలికల వసతి గృహము నందు అన్ని ఖాళీలను వెంటనే పూర్తి చేయాలని వసతి గృహ సంక్షేమ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రైల్వే కోడూరు, రాజంపేట పరిధిలోని వసతి గృహ సంక్షేమ అధికారులు, సంక్షేమ విద్య సహాయకులు, రాజంపేట సాంఘిక సంక్షేమ అధికారి ప్రేమ్ సాగర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఏనుగు మృతికి కారకుడైన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విద్యుదాఘాతంలో ఏనుగు మృతి చెందిన సంఘటనకు సంబంధించి ఒకరిని అరెస్టు చేసినట్లు బాలుపల్లె రేంజ్ ఎఫ్ఆర్ఒ టి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 2న దేశెట్టిపల్లె బీటు పరిధిలోని విపిఆర్ కండ్రిక పంచాయతీకి చెందిన చీకటి నరసమ్మ మామిడి తోటలో విద్యుత్ ఘాతకానికి గురై మృతి చెందిన మగ ఏనుగుకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని అన్నారు. ఈ కేసుకు సంబంధించి ఓబులవారిపల్లె మండలం ముక్కవారిపల్లె ఎస్‌టి కాలనీకి చెందిన కుప్పచర్ల ఈశ్వరయ్య అనే వ్యక్తిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచామని వారి వద్ద నుంచి అల్యూమినియం బైండింగ్ వైరు కర్రలు స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో ఇద్దరు గొప్పచర్ల మల్లికార్జున, కుప్పచర్ల ప్రసాద్ పరారీలో ఉన్నారని వారి కోసం గాలింపు చేపట్టామని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో డిఆర్ఒ ఎస్.చంద్రకళ, ఎఫ్ఎస్ఒ ఎం.బాలచంద్రుడు, ఎఫ్‌బిఒఆర్ సుబ్బలక్ష్మి పాల్గొన్నారని తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరు ..

కలకడ : చోరీ కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. స్థానిక పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాల్లో ఉన్నాయి. మండలంలోని కోట గుడిబండ పంచాయతీ ఎల్లం గుడిబండ హరిజనవాడకు చెందిన నగిరిమడుగు వెంకటరమణ కుమారుడు సాంబశివ, అదే గ్రామానికి చెందిన పత్తూరి బాలాజీ అను ఇద్దరు వ్యక్తులు స్థానికంగా ఉన్న రైతులకు సంబంధించిన వ్యవసాయ భూముల వద్ద డబుల్‌కేబుల్ వైర్లను, ఇనుప పైపులను దొంగిలించే వారన్నారు. వీరు దొంగిలించిన వస్తువుల విలువ సుమారుగా రూ.66వేలు ఉంటుందని అంచనా వేశారు. నింది తులను సాంబశివ, బాలాజీలను శుఅరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కోళ్లబైలు పంచాయతీ కాట్లాటపల్లికి చెందిన ఓబుల్‌రెడ్డి భార్య వెంకటరవణమ్మ(45) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. రెండు నెలల క్రితం ఆమె కుమారుడు కిరణ్‌కుమార్‌రెడ్డి విలాసాలకు బానిసై ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. ఆ ఇంటిలో నివాసం ఉండకూడదని భావించి బయ్యారెడ్డికాలనీలో బాడుగ ఇంటిలో ఉంటూ జీవనం సాగించేవారని అన్నారు. కుమారుడి లేని జీవితంపై విరక్తి చెందిన వెంకటరవణమ్మ గురు వారం అర్ధరాత్రి ఇంట్లోనే చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారు. శుక్రవా రం ఉదయం నిద్రలేచిన కుటుంబీకులు ఉరికి వేలాడుతున్న ఆమెను గమనించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారని అన్నారు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

ప్రజాశక్తి-కురబలకోట

బొలెరో-ద్విచక్రవాహనంఢీ కొని విద్యార్థి మృతి చెందిన సంఘటన కురబలకోట మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు కురబలకోటకు చెందిన కురబలకోట సాబ్‌జాన్ కుమారుడు నాసీర్ (26) మదనపల్లెలో ఓ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడని తెలిపారు. మదనపల్లె నుంచి తిరుగు ప్రయాణంలో ద్విచక్రవాహనంపై వస్తూ విశ్వం కళాశాల దగ్గర ఎదురుగా వస్తున్న బొలెరోను ఢీ కొని అక్కడికక్కడే మృతిచెందాడని తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.